
# కథ కాని కథ

## వేదగిరి రాంబాబు



నెంబర్ 'త్రీ' బస్‌కోసం ఎదురు చూస్తూ శంకర మఠం దగ్గర నిలబడ్డాను.

అలా అక్కడ నిలబడి బస్‌కోసం ఎదురు చూట్టం ప్రారంభించి అప్పటికి ఇరవై నిముషాలు దాటిపోయింది. బస్సులు వస్తున్నై, పోతున్నై. కానీ వాటిలో మూడో నెంబరు మాత్రం వుంటంలేదు. వెళ్తే ఒకదానివెంటే మరొకటి రెండో మూడో వెళ్తాయి! లేకపోతే ఏ అరగంట దాకానో ఒక్క బస్సూ వుండదు!

ఆ రోజు ఆదివారం కావడంవల్ల మారేడ్‌పల్లిలో వున్న మా పెదనాన్నా వాళ్ళింటికి వెళ్దామని బయల్దేరాను.

ఉద్యోగరీత్యా నేను హైద్రాబాద్ వచ్చి హోటల్ భోజనం, రూమ్ నిద్ర ప్రారంభించి రెణ్ణెల్లు దాటుతోంది. అయినా ఇంతవరకూ పెద్ద చెప్పుకోతగ్గ పరిచయాలేమీ ఏర్పడలేదు. బంధువులు కూడా ఈ జంటనగరాల్లో మా పెదనాన్నా వాళ్ళుతప్ప మరెవ్వరూలేరు. మా పెదనాన్నకి కొడుకుల్లేరు! ముగ్గురూ కూతుళ్లే! అందరూ చాలా సరదాగా వుంటారు. వాళ్ళింటికెళ్తే మంచి కాలక్షేపం. అందుకని ఆఫీసుకి శలవొచ్చిందంటే వుదయం భోంచేయంగానే వాళ్ళింటికి వెళ్తాను.

మాలతి, లత మా పెదనాన్న పెద్ద కూతురు. అది చాలా బాగా పాడుతుంది. కాసేపు దాని పాటలు వినడం, తర్వాత అందరంకల్సి కబుర్లు చెప్పుకోవడం, కారమ్‌బోర్డు ఆడుకోవడం, ఇంకా టైముంటే అలా బయటి కెక్కడికైనా షికారు కెళ్లడం. ఇలా చాలా సర్దాగా గడిచిపోతుంది. రాత్రి భోజనాలు కాగానే తిరిగి రూమ్‌కి బయల్దేరతాను. రొటీన్ లైఫ్ మధ్య అదో పెద్ద రిలీఫ్!

విసుగ్గా వాచీ వంక చూసుకున్నాను.

పన్నెండుంబావ్!

ఎక్కడా బస్సొస్తున్న జాడలేదు.

ఎండ నిప్పులు చెరుగుతోంది.

వేడిగాలి సుళ్ళు తిరుగుతోంది.

చెమటతో లోపలి బనీను, చొక్కా చాలా భాగం తడిసిపోయింది.

చిరాకేస్తోంది!

ఒక్క క్షణం — 'ఆటోలో వెళ్ళిపోతే?' అన్పించింది. కానీ ఇంతసేపూ వెయిట్‌చేసి, ఆటోలో ఎక్కగానే వెనకే బస్సొస్తే ప్రాణం వుసూరు మంటుంది. అందుకని ఆ ప్రయత్నాన్ని విరమించుకుని బస్‌కోసం వెయిట్ చేస్తూ నించున్నాను. రకరకాల ఆలోచన్లు ఈగల్లా మనసుని ముసరసాగాయి.

లత, పద్మ, జయ, పెదనాన్న, అమ్మ— అంతా ఇంకా ఎందుకు రాలేదోనని ఎదురు చూస్తుంటారు. అసలు పెదనాన్నకి నేనిలా రూమ్ తీసుకుని వంటరిగా వుండటం ఇష్టంలేదు. 'వచ్చేసి మాతోపాటే వుండరా' అంటాడు.

'నువ్వు డబ్బులిస్తే వాడు తీసుకోడు. ఏమీ ఇవ్వకుండా ఎన్నాళ్ళని అక్కడుంటావ్?' అంటారు నాన్నగారు.

అందుకనే ముందు వో వారం రోజులు వాళ్ళింట్లోవున్నా, తర్వాత వో రూమ్ చూసుకుని నల్లకుంట వచ్చేశాను.

"ఎక్స్‌క్యూజ్ మీ!" పలకరింపుతో ఆలోచనల్లోంచి బయటపడి పక్కకి చూశాను.

బహుశా అతనికీ నా వయసే వుంటుంది. ఇరవైనాలుగేళ్ళుండొచ్చు! పెరిగిన గడ్డం, పలిగిన గుడ్డలు, మొహంలోని దైన్యం — అతని స్థితిని చెప్పకనే చెప్తున్నాయ్!

ఏంటన్నట్లు అతనివంక చూశాను.

"మీరు వేరేగా అనుకోకపోతే..." నసిగాడు.

ఏదో చెప్పాలనుకున్నట్లుంది. చెప్పడానికి తటపటాయిస్తున్నాడు.

అతన్ని చూస్తుంటే అతని పరిస్థితి అర్ధమవుతూనే వుంది. ఆర్థిక సహాయం కోసం వచ్చుంటాడు. కాకపోతే అతన్లో మరుగుపడిపోబోతున్న సంస్కారం తాలూకు మొహమాటం అడ్డుపడుతున్నట్లుంది. అందుకనే అడగలేకపోతున్నాడు. అతని అవస్థ చూస్తుంటే బాధేసింది.

"పర్లేదు చెప్పండి" అన్నాను.

"మాది తెనాలి. అక్కడే బి. యస్. సి. వరకూ చదువుకున్నాను. చదువుకోవడమైతే నావల్లైందికాని వుద్యోగం సంపాదించడం నావల్ల కాలేదు రోజులు సంవత్సరాలుగా మారిపోతున్నాయి. రోజులోపాటు

# కథ కాని కథ

అందరికీ — చివరికి మా ఇంట్లో వాళ్ళకూడా నామీద అభిమానం పూర్తిగా కరిగిపోయి, అసహ్యం చోటు చేసుకోసాగింది. నన్నూ, నా బాధని అర్ధం చేసుకునే వాళ్ళే కరువయ్యారు. అందరూ సూటిపోటి మాటలనడం ప్రారంభించారు. ఇక అక్కడుండలేక కట్టుబట్టలతో,సర్టిఫికేట్లతో ఇక్కడికి వచ్చేశాను. ఏదైనా వుద్యోగం దొరికి నా కాళ్ళమీద నిలబడ్డప్పుడే తిరిగి ఇంటికి వెళ్ళాలనుకున్నాను. ఆత్మాభిమానంతో వచ్చేయడమైతే వచ్చేశానుగాని, ఇక్కడా నాకుద్యోగం దొరికే ప్రాప్తం కన్పించడం లేదు. మూడు రోజుల్నించీ కన్పించిన ప్రతి ఆఫీసుకీ వెళ్తూనే వున్నాను. కానీ ఫలితం శూన్యం. వో నిట్టూర్పు విడిచి తిరిగి చెప్పడం ప్రారంభించాడు.

"భోంచేసి రెండు రోజులైంది. నీర్సంగా వుంది ప్లీజ్! నన్నర్ధం చేసుకుని ఏదైనా సహాయం చేయండి" కర్చీఫ్‌తో కళ్ళు తుడుచుకున్నాడు.

అతన్నలా చూస్తుంటే విపరీతమైన బాధేసింది.

వో అర్ధరూపాయి అతనికిద్దామనిపించి జేబులోకి చెయ్యి పోనిచ్చాను.

అతను ఆశగా నా వంకే చూస్తున్నాడు.

"పాపం!" అన్నంతిని రెండు రోజులైందిట. నేనర్ధరూపాయిస్తే మాత్రం లాభమేంటి? అతను తింటానికేదైనా ఇప్పిస్తే బావుండనిపించింది.

"నాతో రండి" అతన్తో అంటూ ఎదురుగావున్న స్వీట్‌షాప్‌వేపు దారితీశాను. అతను నావెంటే వచ్చాడు.

రెండు రకాల స్వీట్లు తెప్పించాను.

అతను ఆవురావురంటూ తినేశాడు.

పాలు తెప్పించాను.

అతను పాలను త్రాగుతుండగా 'త్రీ' వచ్చింది.

"మీరు నెమ్మదిగా తాగి వెళ్ళిపొండి. నేను బిల్లు చెల్లించి వెళ్తున్నాను" గబగబా కౌంటర్ దగ్గరకెళ్ళి బిల్లు చెల్లించి బస్‌కేసి పరుగెత్తాను.

నేను వెళ్ళేసరికి బస్ వెళ్ళిపోయింది.

దాదాపు — అరగంటనించీ బస్ కోసం వెయిట్ చేస్తున్నాను. తీరా బస్సొచ్చినా అందుకోలేకపోయాను. తర్వాతి బస్ మళ్ళీ ఎంతసేపటికొస్తుందో!

ఆ ఎండలో అక్కడ నిలబడలేక తిరిగి స్వీట్‌షాపు దగ్గర కొచ్చాను.

అప్పుడే అతను బయటి కొచ్చాడు.

"దాదాపు అరగంట నించీ బస్ కోసం వెయిట్ చేస్తున్నాను. చివరికి వచ్చింది కాని మిస్సయ్యాను" అన్నానతన్తో.

"మంచిశాస్తే జరిగింది!" అన్నాడతను నవ్వుతూ.

అతని నవ్వులో ఓ విధమైన ద్వేషం కనిపించింది. ఆశ్చర్యంగా అతని వేపు చూశాను.

"లేకపోతే ఏమిటి! నేను నా గొడవంతా చెప్పుకొని, ఆకలిగా వుందని ప్రాధేయపడితే మీకు నామీద ఏమాత్రం నమ్మకం కలగలేదు. అందుకే నాకు డబ్బు లియ్యకుండా మీరే తీసుకెళ్ళి తినిపించారు. ఎదుటి మనుష్యుల్ని సరిగా అర్ధం చేసుకోని మీలాంటి వాళ్ళ కిలాగే జరుగుతుంది" అనేసి చరచరా వెళ్ళిపోయాడతను.

మరో మూడో నెంబరు బస్సు నా ముందు వచ్చి వెళ్ళిపోయినా కదలకుండా అక్కడే నిలబడి పోయాను.

